పూత పాయే.. గుంతలు మిగిలే!

- వర్షాలకు మళ్లీ గుంతలు
- జాతీయ రహదారిపై రాకపోకలకు అవస్థలు

పావలా కోడికి ముప్పావలా మసాలా ..!
ఈ సామెత గుర్తుందిగా...
అచ్చం అలానే ఉంది కూటమి సర్కారు తీరు.

రోడ్లపై గుంతలు పూడ్చడం కూడా ఓ మహా యజ్ఞంలా ఆర్భాటం చేశారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను అభివృద్ధి చేస్తామని ఊదర గొట్టారు. పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయి. మరో వైపు చేసిన ప్యాచ్ వర్కులు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్నాయి. దీంతో మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ఆ రోడ్లపై ప్రయాణం చేస్తున్న వాహన దారులు దీనికేనా..! అంతలా డప్పు కొట్టారని ఎద్దేవా చేస్తున్నారు.



గాజువాక: గాజువాకలో జాతీయ రహదారిపై ప్రయాణానికి నరకం కనిపిస్తోంది. అడుగడుగునా గోతులు ఉండడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇటీవల హైవేపై గోతులకు ప్యాచ్‌వర్క్‌లు చేసి పూడ్చిన విషయం తెలిసిందే. రెండు వారాల కిందట కురిసిన వర్షాలకు ఆ ప్యాచ్‌వర్క్‌లన్నీ దెబ్బ తిని మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

భారీ వాహనాలతో భయం



జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో గుంతల వల్ల భయం భయంగా ఉంటుంది. భారీ వాహనాలు రావడంతో తప్పించుకోలేక ఇబ్బంది పడుతున్నాం. జాతీయ రహదారి విశాఖ నగరం మధ్యలో ఉంది. అందువల్ల ఈ రోడ్డుపై భారీ వాహనాలకు సమయాన్ని నిర్ణయించాలి. రోడ్డుపై ఏదైనా గుంతలో పడినప్పుడు వెనుక నుంచి వస్తున్న భారీ వాహనాలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

– ఎం.చక్రధర్, గాజువాక

లైట్లు సరి చేయాలి



జాతీయ రహదారిపై విద్యుద్దీపాలు సరి చేయాలి. మొత్తం లైట్లన్నీ వెలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రిపూట రోడ్డుపై ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియడం లేదు. కనీసం లైట్లు పని చేస్తే వాహన చోదకులకు కొంత ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎల్లేటి శ్రీనివాసరావు, పెదగంట్యాడ

అడుగుకో గుంత.. ప్రయాణానికి అవస్థ

షీలానగర్ మొదలుకొని అగనంపూడి వరకు జాతీయ రహదారిపై లెక్కలేనన్ని గోతులు ఉన్నాయి.దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనచోదకులు ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల వడ్లపూడి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి గోతులో పడి ప్రమాదానికి గురికావడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్నా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలపై వెళ్లడంకంటే నడిచి వెళ్లడమే ఉత్తమమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. భారీ వాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై గోతులు లేకుండా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు. గుంతలను పూడ్చడంతోపాటు అవసరమైనచోట కొత్తగా నిర్మించాలని కోరుతున్నారు.

చాలా దారుణంగా హైవే



జాతీయ రహదారి చాలా దారుణంగా తయారైంది. ఎక్కడ గుంత లేదో చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ప్రాంతంలో అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. గమ్యానికి చేరుకొనేసరికి నీరసం వస్తోంది.

– ఎస్.సూరిబాబు, విశాఖ సిటీ

రోడ్డుపై గోతులు పూడ్చారు



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రమాదకరమైన గోతులను పూడ్చుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న గోతులను హై వే అథారిటీ అధికారులు పూడ్చారు. ఈ నెల 2వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన అమ్మో భెల్ సిగ్నల్ కథనానికి స్పందించిన అధికారులు ఆదివారం గోతులు పూడ్చే ప్రక్రియను ప్రారంభించారు. సమస్య పరిష్కారం కావడంతో పలువురు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

'ఆ భవనాన్ని విశ్రాంత ఉద్యోగులకు కేటాయించాలి'

అగనంపూడి: జాతీయ రహదారికి చేరువలో అగనంపూడిని ఆనుకొని ఉన్న ఎన్టీఆర్ పార్క్ భవన ప్రాంగణాన్ని తమ సంఘానికి కేటాయించాలని అగనంపూడికి చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘం కోరింది. 2003లో ప్రభుత్వ నిధులతో ఎన్టీఆర్ పార్క్ స్థలంతోపాటు భవనం నిర్మించారని, అప్పటి నుంచి నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోందన్నారు. 79, 85 వార్డుల్లో సుమారు 3వేల మంది ఉక్కు, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వీరి కార్యకలాపాలకు భవనాన్ని అప్పగించాలని నాయకులు కె.అప్పారావు, బి.సత్యనారాయణ, డి.పైడికొండ, ఎన్.సన్యాసిరావు, డి.రమేష్, వి.వరహాలు, ఎస్.సన్యాసిరావు, ఎల్.వి.రమణ తదితరులు కోరారు.

క్లుప్తంగా

వైభవంగా వెంకన్న తిరువీధి



ఉక్కునగరం సెక్టార్లలో వెంకన్న ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వెంకన్న ఉత్సవ మూర్తులను రథంపై అధిష్ఠంపజేసి ఊరేగించారు. మహిళలు, పిల్లలు కోలాటం ఆడారు. అంతకుముందు స్వామికి వేకువజామున ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్చులు, హరినారాయణ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక జీవీకే ఎడ్యూటెక్ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. 68వ వార్డు మిందిలోని అమర్‌నాథ్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎడ్యూటెక్ రీజనల్ డైరెక్టర్ ఎస్.ఆర్.కిరణ్ కుమార్, విద్యావేత్త గుడివాడ శ్రీనివాసరావు, కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



టాస్ వేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్

అగనంపూడి: సంక్రాంతి సందర్భంగా వడ్లపూడిలో నిర్వహిస్తున్న వార్డు క్రికెట్ లీగ్ టోర్నమెంట్ రెండో రోజు పోటీలను వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల పరిచయ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మొదలవలస అప్పలరాజు, నాయకులు ఆడారి శ్రీను, న్యాయవాది లీలాప్రసాద్, కాంట్రేగుల దినేష్, మొల్లి మహేష్ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆర్చి నుంచి ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో చెట్ల మధ్య వృద్ధుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. దువ్వాడ సెక్టార్–1లో నివసిస్తున్న కర్రి కొండలరావు (67) శనివారం ఉదయం 10.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఆ రాత్రి అతను ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం ఆర్చికి సమీపంలోని చెట్ల మధ్య మృత దేహం ఉండడంతో స్టీల్‌ప్లాంట్ పోలీసులు విచారించారు. కొండలరావు కుటుంబీకులకు సమాచారం అందించగా వారు వచ్చి కొండలరావును గుర్తించారు. అతని ఒంటిపై ఎటువంటి గాయాలు కనిపించలేదు. అనారోగ్యంతో ఉన్న కొండలరావు మలవిసర్జనకు వెళ్లగా గుండెపోటు రావడంతో మరణించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వెంటనే క్లూస్ టీంకు సమాచారం అందించగా వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉక్కు ఉద్యోగుల చలో కలెక్టరేట్



వడ్లపూడి నిర్వాసితకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు, నిర్వాసితులు



అగనంపూడి నిర్వాసితకాలనీల్లో..

విజయవంతం చేయాలని నేతల పిలుపు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలనే డిమాండ్‌తో సోమవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్ బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి నిర్వాసితకాలనీలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తున్నామని ప్రకటించాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్‌తో నిర్వహించనున్న ర్యాలీలో నిర్వాసితులు, కార్మికులు, మద్దతుదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, విజయరామరాజు, ఎన్నేటి రమణ పాల్గొన్నారు.

- విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసే వరకూ పోరాటం ఆగదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు కె.సత్యనారాయణరావు అన్నారు. సోమవారం నాటి చలో కలెక్టరేట్ బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తూ అగనంపూడి నిర్వాసితకాలనీల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, పెదిరెడ్ల నీలకంఠం, కరణం పైడిరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, శీరంశెట్టి గోవిందరావు, కొలిపాక అప్పారావు, పట్టా రమేష్, చిత్తా అబ్బాయి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలి



పెదగంట్యాడలో మహాపాదయాత్ర చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు



ఉక్కునగరం రైతుబజారు వద్ద ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

పెదగంట్యాడ: ఈ నెల 8న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ విలీనం చేస్తూ ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు గాంధీ విగ్రహం వరకూ ఆదివారం మహాపాదయాత్ర నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర పెదగంట్యాడ జంక్షన్ నుంచి దుర్గవానిపాలెం, చిన కోరాడ, నెల్లిముక్కు, బాలచెరువు, సీతానగరం మీదుగా నడుపూరు గాంధీ విగ్రహం వరకూ సాగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు, కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, అనిపెద్ది మసేనురావు, రామస్వామి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉక్కునగరం: ప్రధాని నరేంద్రమోదీ విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం రైతు బజార్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతోనే యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అదే విధంగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని కేంద్రాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి జరిగితే ప్రజలకు తక్కువ ధరకే ఉక్కు ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. అవసరమైన ముడి ఖనిజం కొరత తగ్గించడం కోసం ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఉపశమనం కలుగుతుందన్నారు. పరిశ్రమ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి మూడేళ్ల ట్యాక్స్ హాలిడే ప్రకటించే విధంగా కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. కార్యక్రమంలో వై.టి. దాస్, డి. నర్సింగరావు, వి. ప్రసాద్, పుల్లారావు, మహేష్, రాథోడ్, దుర్గాప్రసాద్, మధుసూదన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల వితరణ

ఉక్కునగరం: రోడ్డు పక్కన చలితో బాధపడుతున్న నిరాశ్రయులకు సత్యసాయి సంస్థల ప్రతినిధులు చేయూత అందజేశారు. సత్యసాయి 100వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా సత్యసాయి సేవా సమితి, సేవాదళ్ సభ్యులు రైల్వే స్టేషన్, బస్టాపులు, ఫుట్‌పాత్‌లలో ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా సమన్వయకర్త ఆర్.ఎ. నాయుడు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సత్యసాయి యువత, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



నిరాశ్రయులకు దుప్పట్లు అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

కళాసీలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నితీష్‌రెడ్డి, మంగరాజు

పెదగంట్యాడ: పేదలు సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించుకునేందుకు దుస్తులు అందజేయడం అభినందనీయమని వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు తిప్పల నితీష్‌రెడ్డి అన్నారు. పెదగంట్యాడ వర్తక సంఘం సభ్యుడు కులుకూరి మంగరాజు ఆధ్వర్యంలో పెదగంట్యాడ అరుణ సినిమా హాల్ ప్రాంగణంలో కళాసీలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు ఆనంద్, బచ్చు శ్రీనివాసరావు, కొత్తా నవీన్, అరుణ సూర్యనారాయణ, నంభూరి సత్యనారాయణ ,అయ్యప్ప, ఎస్వీఎస్ కృష్ణ పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో 69వ వార్డు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 34 మంది కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్టు ఆ సంస్థ డిప్యూటీ మేనేజర్ ఎస్.వి.రమణ తెలిపారు. సింధియా, శ్రీహరిపురం, మల్కాపురం, గాంధీగ్రామం పాఠశాలల్లో 3200 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, కో – ఆర్డినేటర్ డి.రాజీవ్, కంటి వైద్యులు డాక్టర్ పి.నిషాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

గాజువాక: స్థానిక వంటిల్లు జంక్షన్ నుంచి వుడా కాలనీ డబుల్ రోడ్‌లోని శివాలయం వరకు మురుగునీరు రోడ్‌పై నిలిచిపోతోంది. రోడ్డుకిరువైపులా కాలువలు లేకపోవడంతో స్థానికులు వాడిన నీరు రోడ్‌పైకి వచ్చేస్తోంది. మురుగునీరు దుర్వాసన వెదజల్లుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

గెడ్డలోంచి తీసి.. రోడ్డుపై పోసి..



వికాస్‌నగర్ ప్రధాన గెడ్డలో పూడిక తీసి రోడ్డుపై పడేసిన దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌కు వెళ్లే రహదారిలో ఉన్న ప్రధాన గెడ్డలో పూడికను శనివారం సాయంత్రం తీశారు. ఆపై దాన్ని వంతెన పైనే పడేశారు. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులు పడ్డారు. దుర్వాసన కారణంగా ముక్కు మూసుకుని రాకపోకలు సాగించారు. స్థానికంగా ఉంటున్న వారు దుర్గంధం భరించలేక ఇళ్లలోని కిటికీలు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్లక్ష్యంగా పూడికను రోడ్డుపై పడేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే పూడికను నుంచి తొలగించి బ్లీచింగ్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి రంగు బయట పడింది

వైఎస్సార్‌టీయూ ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి

అగనంపూడి: అధికారంలోకి వచ్చిన ఆరుమాసాల్లో కూటమి ప్రభుత్వం అసలు స్వరూపం బయటపడిందని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పిట్టారెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆదివారం వారు మాట్లాడారు.

ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారం ఇస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పి నేడు కనీసం నోరుమెదపకపోవడంతో వీరి బాగోతం ప్రజలకు అర్థం అయిందన్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరడం మానేసి మిట్టల్ నిర్మిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు లైసెన్స్, ఇనుప గనులు కేటాయించాలని ప్రధాని మోదీని కోరడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు విశాఖలో అడుగు పెట్టే హక్కు ప్రధానిమోదీకి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, గొందేశి ప్రభాకర్ రెడ్డి, మద్ది అప్పలరాజు, బైరెడ్డి అప్పలరెడ్డి, గొందేశి మంగరాజు, బీఎంకె రాజు, అప్పారావు, సత్యనారాయణ, గోవింద్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు పోస్టుకార్డు ఉద్యమం

స్వీకారం చుట్టిన మస్తానప్ప మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్



పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో మస్తానప్ప మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించారు. ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గం మొదటి సమావేశంలో గొందేశి అప్పలరెడ్డి మాట్లాడుతూ మస్తానప్ప విశాఖ ఉక్కు కర్మాగారం, కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహనతో ఉండేవారన్నారు. పోరాట కమిటీ సమావేశంలో సెయిల్‌లో విలీనం అంశంపై ఆయన చేసిన వాదనతో కమిటీ ఏకీభవించిందన్నారు. ట్రస్టు మొదటి కార్యక్రమంలో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పోస్టు కార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ చైర్మన్ చరిష్మా, మస్తానప్ప సతీమణి వరలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో ట్రస్టు తరపున సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్, ఎస్. మురళీ, వై. నవీన్, ఎస్. చంద్రశేఖర్, ఎన్. అనీల్‌కుమార్, ఎస్. సూరిబాబు, పి. రవి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం చెత్త పని!

అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ గోడ పక్కన కుప్పలుగా పేరుకుపోయిన చెత్త



అక్కిరెడ్డిపాలెం: కొంత మంది నిర్లక్ష్యం విద్యార్థులకు అవస్థలు తెచ్చిపెడుతోంది. కనీసం జ్ఞానం లేకుండా పాఠశాల ప్రహరీకి ఆనుకుని చెత్త డంపింగ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పాఠశాలకు ఆనుకుని గతంలో జీవీఎంసీ సిబ్బంది డంపర్‌బిన్ ఏర్పాటు చేశారు. దీంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లేది. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు అవస్థలు పడేవారు. సమస్యను జీవీఎంసీ అధికారులకు వివరించడంతో పాఠశాలకు ఆనుకుని పెట్టిన డంపర్‌బిన్‌ను అక్కడ నుంచి తొలగించారు. దీంతో సమస్య తీరిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అది ఎన్ని రోజులూ నిలవలేదు. బాధ్యత లేని కొంత మంది ఇళ్లలో చెత్తను మళ్లీ ప్రహరీ చెంత వేయడంతో కుప్పగా మారింది. ఇది చూసిన వారు ఇదేం చెత్తపని అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.